క్లుప్తంగా

దూబచర్లలో 230 మందికి వైద్య సేవలు

నల్లజర్ల: మండలంలోని దూబచర్ల ఎలైట్ కళాశాలలో ఆదివారం ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. ఏలూరు ఆయుష్ ఆసుపత్రి వైద్య బృందం 230 మందికి ఉచితంగా ఈసీజీ, రక్త పరీక్షలు చేశారు. అవసరమైన రోగులకు ఉచితంగా మందులు అందజేసినట్టు ఆ కళాశాల ప్రిన్సిపాల్ కె.శ్రీలక్ష్మి తెలిపారు. ఈ శిబిరంలో గుండె వైద్య నిపుణులు బొప్పన దశరథ్, ఎముకలు, కీళ్ల వైద్య నిపుణుడు సాయికృష్ణ, గైనకాలజిస్టు కె.రమ్య సేవలు అందించారు. ఇదే కళాశాలలో విద్యార్థులు నిర్వహించిన కాలేజ్ ఫెస్ట్‌కు నల్లజర్ల సీఐ దుర్గాప్రసాద్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. శతావధాని బులుసు అపర్ణ, పంచాయతీ కార్యదర్శి రత్నం తదితరులు పాల్గొన్నారు.

వృద్ధురాలి వైద్యానికి ఆర్థిక సాయం

ఉండ్రాజవరం: మండలంలోని తాడిపర్రు గ్రామానికి చెందిన ఓ వృద్ధురాలి వైద్యానికి ఆదివారం మానవత సంస్థ మండల శాఖ రూ.ఐదు వేల ఆర్థిక సాయం చేసింది. అంతకు ముందు ఆ సంస్థ మండల శాఖ నెల వారీ సమావేశాన్ని ఉండ్రాజవరంలోని సీతారామ కల్యాణ మండపంలో చైర్మన్ తాతిని కృష్ణారావు అధ్యక్షతన నిర్వహించారు.పలు అంశాలపై సమీక్షించారు. కార్యక్రమంలో మాజీ అధ్యక్షుడు నందిగం పాపారావు, ఆత్మీయ సహకార కమిటీ సభ్యురాలు ఫణితిన పార్వతి, మాజీ చైర్మన్ బూరుగుపల్లి వెంకటేశ్వర్లు, కార్యదర్శి సుంకవల్లి వెంకటేశ్వరరావు, కోశాధికారి కోడూరి ప్రసాద్ సభ్యులు పాల్గొన్నారు.

నేడు, రేపు తాడిపర్రులో సరఫరా నిలిపివేత

ఉండ్రాజవరం: వార్షిక మరమ్మతుల నిమిత్తం మండలంలోని తాడిపర్రు గ్రామంలో సోమ, మంగళవారాల్లో ఉదయం 10 నుంచి సాయంత్రం 5.30 గంటల వరకూ విద్యుత్తు సరాఫరాకు అంతరాయం కలుగుతుందని ట్రాన్స్‌కో నిడదవోలు ఈఈ బి.వీరభద్రరావు ఆదివారం తెలిపారు. వ్యవసాయ ఫీడర్లకు వేకువజాము నాలుగు నుంచి ఉదయం 10 గంటల వరకూ, సాయంత్రం 5.30 గంటల నుండి సరఫరా ఇచ్చేలా మార్పు చేసినట్టు ఆయన వివరించారు.

ల్యాండ్ టైట్లింగ్ చట్టం రద్దు చేయాలి

తాళ్లపూడి: ప్రజల ఆస్తులకు భంగం కలిగించే ఏపీ ల్యాండ్ టైట్లింగ్‌చట్టాన్ని రద్దు చేయాలని కొవ్వూరు బార్ అసోసియేషన్ అధ్యక్షురాలు బొబ్బా భారతి కోరారు. కొవ్వూరు బార్ అసోసియేషన్ ఆధ్వర్యంలో తాళ్లపూడి పంచాయతీ సమీపంలోని బస్టాండ్ వద్ద ఆదివారం న్యాయవాదుల సమావేశం నిర్వహించారు. ఏపీ ల్యాండ్ టైట్లింగ్ చట్టాన్ని రద్దు చేయాల్సిన అవసరంపై ప్రజలకు అవగాహన కల్పించారు. సమావేశంలో ఏలూరు గోపాలకృష్ణ, వీవీ సుబ్బారావు, ప్రకాష్, సత్యనారాయణ, నాయుడు తదితరులు పాల్గొన్నారు.

నదిలో ఇసుక డ్రెడ్జింగ్‌పై కూలీల నిరసన

తాళ్లపూడి: స్థానిక గోదావరి ఇసుక ర్యాంపుల్లో డ్రెడ్జింగ్ చేస్తూ కార్మికులకు ఉపాధి లేకుండా చేస్తున్నారంటూ పడవల ద్వారా నదిలో ఇసుక సేకరించే కూలీలు ఆదివారం ఆందోళనకు దిగారు. తాళ్లపూడి ఇసుక ర్యాంపులో గోదావరి నదిలో ఇసుక డ్రెడ్జింగ్ చేస్తున్న పడవలను అడ్డుకున్నారు. ఈ సందర్భంగా కూచిపూడి గణపతి, డి శేషు, భరత్ తదితరులు మాట్లాడుతూ ర్యాంపుల్లో పడవలను పక్కన పెట్టి ర్యాంపు నిర్వాహకులు గత కొద్ది రోజులుగా డ్రెడ్జింగ్ పడవల ద్వారా ఇసుకను సేకరిస్తున్నారన్నారు. పైగా బిల్లులు లేకుండా ఇసుక విక్రయాలు చేస్తున్నారని ఆరోపించారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి

దేవరపల్లి: జాతీయ రహదారిపై దేవరపల్లి మండలం కృష్ణంపాలెం వద్ద ఆదివారం జరిగిన ప్రమాదంలో ఓ వ్యక్తి మృతి చెందాడు. పోలీసుల కథనం ప్రకారం శ్రీకాకుళం జిల్లా కొత్తూరు మండలం పాతపాడుకు చెందిన కంఠ బాలకృష్ణ (20) బైక్‌పై విజయవాడ వైపు వెళుతుండగా కృష్ణంపాలెం వద్ద అదుపు తప్పి డివైడర్‌ను ఢీ కొట్టాడు. ఈ ప్రమాదంలో బాలకృష్ణ తలకు తీవ్ర గాయం కావడంతో హైవే అంబులెన్స్‌లో చికిత్స కోసం గోపాలపురం ఏరియా ఆసుపత్రికి తరలిస్తుండగా మార్గ మధ్యలో మృతి చెందాడు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్సై కె. శ్రీహరిరావు తెలిపారు.

రైల్వే ట్రాక్‌పై గుర్తు తెలియని వ్యక్తి మృతదేహం

నిడదవోలు: స్థానిక చిన కాశిరేవు సమీపంలో చాగల్లు వైపు కొత్త రైల్వే లైన్ ట్రాక్ వద్ద గుర్తు తెలియని వ్యక్తి మృతదేహాన్ని రైల్వే పోలీసులు ఆదివారం గుర్తించారు. రైల్వే ట్రాక్‌మన్ ఇచ్చిన సమాచారంతో రైల్వే పోలీసులు ఘటన స్థలానికి వెళ్లి విచారణ చేపట్టారు. మృతుడి వయసు సుమారు 45 ఏళ్లు ఉంటాయని, అతడి వంటిపై గాయాలున్నాయని వారు తెలిపారు. మృతుడి వంటిపై పసుపు రంగు ఫుల్ హ్యాండ్స్ చొక్కా, బ్రౌన్ కలర్ కాటన్ ప్యాంట్ ఉన్నాయన్నారు. మృతదేహాన్ని నిడదవోలు ప్రభుత్వాసుపత్రి మార్చురీలో భద్రపరిచి, కేసుగా నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు తాడేపల్లిగూడెం రైల్వే ఎస్సై జి. శ్రీహరి తెలిపారు. మృతుని వివరాలు తెలిసిన వారు 94906 17090, 70133 60296 నంబర్లకు సంప్రదించాలని ఆయన కోరారు.

పాతాళ గంగ.. పైపైకి

- జలకళ పథకంతో బోర్ల ఏర్పాటు
- సాగులోకి బీడు భూములు
- సన్న, చిన్నకారు రైతుల్లో సంతోషం
- గోపాలపురం నియోజకవర్గంలో 296 బోర్లు



జలకళ పథకంలో దేవరపల్లి మండలం పల్లంట్లలో మేడికొండ శ్రీరామకృష్ణమోహన్ అనే రైతు పొలంలో వేసిన బోరు

దేవరపల్లి: వైఎస్సార్ జలకళ పథకం మెట్ట ప్రాంత రైతులకు వరంగా మారింది. సాగునీటి వసతులు లేక ఈ ప్రాంత భూములు బీడులుగా దర్శనమిచ్చేవి. వాటిని సాగులోకి తీసుకువచ్చి సాగు విస్తీర్ణం పెంచడానికి ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి వైఎస్సార్ జలకళ పథకాన్ని తీసుకు వచ్చారు. ఐదెకరాల లోపు భూమి ఉన్న సన్న చిన్నకారు రైతులను ఎంపిక చేసి, వారికి ఉచితంగా బోర్లు మంజూరు చేశారు. ఒక్కొక్క బోరుకు రూ.5 లక్షలు మంజూరు చేయడంతో పాటు మోటార్‌కు రూ.1.50 చొప్పున ప్రభుత్వం ఉచితంగా అందజేసింది. దీంతో ఇప్పటి వరకూ గోపాలపురం నియోజకవర్గంలో సుమారు మూడు వేల ఎకరాలు సాగులోకి వచ్చాయి. బోర్ల సాయంతో రెండు పంటలు పండిస్తూ రైతులు ఆదాయం పొందుతున్నారు.

నియోజకవర్గంలో రూ.1.50 కోట్లతో..

గోపాలపురం నియోజకవర్గంలో వైఎస్సార్ జలకళ పథకం ద్వారా ఇప్పటి వరకూ 296 బోర్లు వేశారు. రాష్ట్ర ప్రభుత్వం రూ.1.50 కోట్ల వ్యయంతో రైతులకు ఉచితంగా బోర్లు వేసి అప్పగించింది. సుమారు రూ.45 లక్షల వ్యయంతో విద్యుత్ మోటార్లు కొనుగోలు చేసి రైతులకు ఉచితంగా అందజేసింది. దాంతో లబ్ధి పొందిన రైతుల కుటుంబాల్లో ఆనందం వ్యక్త మవుతోంది. జలకళతో బీడు వారిన భూములు పచ్చని పంటలతో కళకళలాడుతున్నాయని రైతులు సంతోషంగా చెబుతున్నారు. దేవరపల్లి మండలంలో 66 బోర్లు, నల్లజర్ల మండలంలో 39 బోర్లు, గోపాలపురం మండలంలో 18 బోర్లు, ద్వారకాతిరుమల మండలంలో 173 బోర్లు మంజూరు చేశారు. గోపాలపురం మండలంలో 26 మందికి, దేవరపల్లి మండలంలో 9 మందికి విద్యుత్ మోటార్లు అందజేశారు.

మెట్ట రైతులకు వరం జలకళ



ప్రభుత్వం ప్రవేశపెట్టిన వైఎస్సార్ జలకళ మెట్ట ప్రాంత రైతులకు వరంలా ఉంది. సాగునీటి వసతి లేక ఇబ్బంది పడుతున్న రైతులకు మేలు జరిగింది. రెండెకరాలు, మూడెకరాల రైతులు బోరు వేసుకోవాలంటే ఆర్థిక భారం కావడంతో వేలాది ఎకరాల భూములు నిరుపయోగంగా ఉన్నాయి. వర్షాధారంపై ఆదారపడి పంటలు పండిస్తున్నాం. వైఎస్సార్ జలకళ పథకంలో బోరుకు రూ.5 లక్షలు, మోటారుకు రూ. 1.50 లక్షలు మంజూరు చేశారు. బోరు వేసి, మోటారు ఏర్పాటు చేశాను. ఏడాదికి రెండు పంటలు పండిస్తున్నాను. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి రైతులు రుణపడి ఉంటారు.

– ముళ్లపూడి రామారావు, రైతు, పల్లంట్ల, దేవరపల్లి మండలం

రైతుల సంక్షేమమే ప్రభుత్వ లక్ష్యం



రైతుల సంక్షేమమే లక్ష్యంగా ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి పాలన సాగిస్తున్నారు. రైతు భరోసా కేంద్రాల ద్వారా రైతులకు నాణ్యమైన ఎరువులు, పురుగు మందులు, విత్తనాలు అందజేస్తున్నారు. పండించిన ధాన్యం, మొక్కజొన్న వంటి పంటలను ఆర్‌బీకేల ద్వారా గిట్టుబాటు ధరకు కొనుగోలు చేస్తున్నారు. వైఎస్సార్ ప్రభుత్వంలో రైతులు ఆర్థికంగా నిలదొక్కుకున్నారు. వైఎస్సార్ జలకళ ద్వారా నియోజకవర్గంలో సన్నచిన్నకారు రైతులను గుర్తించి ఉచితంగా బోర్లు వేసి మోటార్లు అందజేస్తున్నాం. నియోజకవర్గంలో 296 బోర్లు పూర్తి చేశారు.

– తలారి వెంకట్రావు, ఎమ్మెల్యే, గోపాలపురం

అవినీతి లేని పాలన.. మళ్లీ ఓట్లడగండి

- రాష్ట్ర హోం మంత్రి తానేటి వనిత
- వైఎస్సార్ సీపీ దేవరపల్లి మండల స్థాయి ఆత్మీయ భేటీ



సమావేశంలో మాట్లాడుతున్న రాష్ట్ర హోం మంత్రి వనిత. వేదికపై వైఎస్సార్ సీపీ నేతలు

దేవరపల్లి: ప్రస్తుతం రాష్ట్రంలో అవినీతి లేని పాలన సాగుతున్నందున వైఎస్సార్ సీపీ నాయకులు ధైర్యంగా ప్రజల వద్దకు వెళ్లి ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని మరోసారి ఆశీర్వదించాలని కోరాలని రాష్ట్ర హోం మంత్రి, ఆ పార్టీ గోపాలపురం నియోజకవర్గ ఇన్‌చార్జి తానేటి వనిత విజ్ఞప్తి చేశారు. వైఎస్సార్ సీపీ శ్రేణుల దేవరపల్లి మండల స్థాయి ఆత్మీయ సమావేశాన్ని ఆదివారం సాయంత్రం స్థానిక ఆర్య వైశ్య కల్యాణ మండపంలో నిర్వహించారు. పార్టీ మండల కన్వీనర్ కూచిపూడి సతీష్ సమావేశానికి అధ్యక్షత వహించారు. మంత్రి వనిత మాట్లాడుతూ రాబోయే రెండు నెలలు ప్రతి కార్యకర్తా కష్టపడి పని చేసి పార్టీ విజయానికి కృషి చేయాలని కోరారు. ఈ నియోజకవర్గ ప్రజలు, పార్టీ నాయకులతో తనకు అవినావభావ సంబంధం ఉందని ఆమె అన్నారు. పార్టీ ఇన్‌చార్జిల మార్పుపై కొందరిలో అపోహలు ఉన్నాయని, వాటిని పక్కన పెట్టి పార్టీ విజయానికి కష్టపడి పనిచేయాని కోరారు. తలారి వెంకట్రావు కష్టాన్ని దోచుకోవడానికి తానిక్కడకు రాలేదని మంత్రి వనిత అన్నారు. గ్రామ స్థాయిలో కార్యకర్తలకు ఏమైనా సమస్యలు ఉంటే నేరుగా తనకు చెప్పి పరిష్కరించుకోవాలన్నారు. పార్టీ నియోజకవర్గ పరిశీలకుడు గన్నమని వెంకటేశ్వరరావు (జీవీ) మాట్లాడుతూ రాబోయే ఎన్నికల కురుక్షేత్రంలో ప్రతి కార్యకర్తా ఒక అభిమన్యుడిలా పనిచేయాలన్నారు. ఈ సందర్భంగా మంత్రి తానేతి వనితను పార్టీ నాయకులు గజమాలతో సత్కరించారు. కార్యక్రమంలో ఏఎంసీ చైర్మన్ గన్నమని గన్నమని జనార్దనరావు, ఎంపీపీ కేవీకే దుర్గారావు, రాష్ట్ర పామాయిల్ బోర్డు డైరెక్టర్ నరహరిశెట్టి రాజేంద్రబాబు, రాష్ట్ర మహిళా విభాగం ప్రధాన కార్యదర్శి ఆచంట అనసూయ, జిల్లా బీసీ విభాగం అధ్యక్షుడు మేడిబోయిన గంగరాజు, గడా జగదీష్, ఆరేటి సూర్యనారాయణ, గారపాటి రమాప్రభ, కె.వాణి, సాదే సుబ్బారావు తదితరులు పాల్గొన్నారు.

వైఎస్సార్ సీపీలోకి 36 టీడీపీ కుటుంబాలు



ప్రకాశరావుపాలెంలో వైఎస్సార్ సీపీలో చేరిన టీడీపీ కార్యకర్తలతో మంత్రి వనిత

- కండువాలు వేసి ఆహ్వానించిన హోం మంత్రి వనిత

నల్లజర్ల: వైఎస్సార్ సీపీ గోపాలపురం నియోజకవర్గ ఇన్‌చార్జ్‌గా హోం మంత్రి తానేటి వనిత బాధ్యతలు చేపట్టాక ఆ పార్టీలోకి చేరికలు జోరందుకున్నాయి. మండలంలోని ప్రకాశరావుపాలెంకు చెందిన 36 టీడీపీకి చెందిన కుటుంబాలు ఆదివారం మంత్రి తానేటి వనిత సమక్షంలో వైఎస్సార్ సీపీలో చేరాయి. ప్రకాశరావుపాలెంలో నిర్వహించిన కార్యక్రమంలో వారందరికీ మంత్రి వనిత పార్టీ కండువాలు వేసి, సాదరంగా ఆహ్వానం పలికారు. తమకు స్థలాలు కేటాయించి, గృహాలు నిర్మించి ఇచ్చిన జగనన్నకు ఏమిచ్చినా రుణం తీర్చుకోలేమని పార్టీలో చేరిన మాణ్యం శ్రీనివాస్, చిలికే ఏడుకొండలు, జొన్నకూటి రవి, తిరుపాటి వెంకన్న, పొన్నాడ సుబ్రహ్మణ్యం, కొడవల్లి అంజయ్య తదితరులు పేర్కొన్నారు. రాబోయే ఎన్నికల్లో పార్టీ విజయమే లక్ష్యంగా పని చేయాలని ఈ సందర్భంగా మంత్రి వనిత వారికి సూచించారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ గ్రామ కమిటీ అధ్యక్షుడు ముత్తిన నరేష్, కరుటూరి లక్ష్మీగణేశ్వరావు, ఎంపీటీసీ నేకూరి రాజేష్, నాయకులు ముత్తిన నాని, శెనగన సతీష్ గౌడ్, చిన్నీ నాగు యాదవ్, మలుకుర్తి శ్రీను, మండల నాయకులు కారుమంచి రమేష్, మద్దిపాటి ప్రసాద్, వెల్లంకి వెంకట సుబ్రహ్మణ్యం, బంక అప్పారావు, వైస్ ఎంపీపీ అచ్యుత శివాజీ తదితరులు పాల్గొన్నారు.

కడిమి శ్రీనుకు మంత్రి వనిత పరామర్శ

దేవరపల్లి: దుద్దుకూరు వద్ద ఇటీవల జరిగిన రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడి రాజమహేంద్రవరం ఆసుపత్రిలో సర్జరీ అనంతరం ఇంటి వద్ద విశ్రాంతి తీసుకుంటున్న దేవరపల్లి సర్పంచ్ కడిమి వీరకుమారి భర్త శ్రీనును ఆదివారం సాయంత్రం రాష్ట్ర హోం మంత్రి తానేటి వనిత పరామర్శించారు. ప్రమాదం గురించి శ్రీను కుటుంబ సభ్యులను మంత్రి వివరాలు అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ నియోజకవర్గ పరిశీలకుడు గన్నమని వెంకటేశ్వరరావు(జీవీ), ఎంపీపీ కేవీకే దుర్గారావు, రాష్ట్ర మహిళా విభాగం ప్రధాన కార్యదర్శి ఆచంట అనసూయ, మండల కన్వీనర్ కడలి హైమావతి, మాజీ ఎంపీటీసీ సభ్యుడు కడిమి రాజు, తదితరులు పాల్గొన్నారు.

మూడు గ్రామాల్లో 'తలారి' పరిచయ భేటీలు

- పార్టీలో చేరిన వారికి సాదర స్వాగతం
- పాల్గొన్న నియోజకవర్గ పరిశీలకుడు రాజీవ్‌కృష్ణ



చాగల్లులో తలారి వెంకట్రావు, రాజీవ్‌కృష్ణలకు స్వాగతం పలుకుకున్న వైఎస్సార్ సీపీ నాయకులు

చాగల్లు: వచ్చే ఎన్నికల్లో కొవ్వూరు నియోజకవర్గంలో వైఎస్సార్ సీపీని భారీ మెజార్టీతో గెలిపించి ముఖ్యమంత్రి జగనన్నకు కానుకగా ఇద్దామని ఎమ్మెల్యే, ఆ పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జి తలారి వెంకట్రావు అన్నారు. మండలంలోని చంద్రవరం, మల్లవరం, చాగల్లు గ్రామాల్లో ఆదివారం ఆయన విస్తృతంగా పర్యటించారు. వైఎస్సార్ సీపీ నాయకులను, కార్యకర్తలను కలుసుకుని తలారి తనను పరిచయం చేసుకున్నారు. ఆయన వెంట రాష్ట్ర ప్రభుత్వ సలహాదారు, పార్టీ నియోజకవర్గ పరిశీలకుడు ఎస్.రాజీవ్‌కృష్ణ కూడా ఉన్నారు. ఈ సందర్భంగా తలారి మాట్లాడుతూ అన్ని వర్గాల సంక్షేమమే ధ్యేయంగా రాష్ట్ర ప్రభుత్వం పనిచేస్తోందన్నారు. రాజీవ్ కృష్ణ మాట్లాడుతూ నాయకులు, కార్యకర్తలు సమన్వయంతో పని చేసి పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జి తలారి వెంకట్రావును గెలిపించాలని కోరారు. చంద్రవరంలో సర్పంచ్ మద్దిపాటి శ్రీరామమూర్తి, మల్లవరంలో మాజీ సర్పంచ్ లకంసాని సూర్యప్రకాశరావు, చాగల్లులో వైస్ ఎంపీపీ జుజ్జవరపు రామచంద్రరావు గృహాల వద్ద ఈ పరిచయ కార్యక్రమాలు జరిగాయి. మల్లవరం చర్చిలో తలారి, రాజీవ్‌కృష్ణ ప్రార్థనలు చేశారు. కాగా టీడీపీ నుంచి పలువురు కార్యకర్తలు వైఎస్సార్ సీపీలోకి చేరారు. వారికి ఎమ్మెల్యే తలారి, రాజీవ్‌కృష్ణ పార్టీ కండువాలు వేసి ఆహ్వానించారు. కార్యక్రమాల్లో కొవ్వూరు మునిసిపల్ చైర్‌పర్సన్ భావన రత్నకుమారి, కొవ్వూరు, చాగల్లు ఎంపీపీలు కాకర్ల నారాయుడు, మట్టా వీరాస్వామి, జెడ్పీటీసీ సభ్యురాలు గారపాటి విజయదుర్గ, పార్టీ జిల్లా ఉపాధ్యక్షుడు గండ్రోతు సురేంద్రకుమార్, రైతు విభాగం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఆత్కూరి దొరయ్య, పార్టీ మండల గౌరవాధ్యక్ష, అధ్యక్షులు జుట్టా కొండలరావు, చెల్లింకుల దుర్గామల్లేశ్వరరావు, బండి అశోక్‌బాబు పాల్గొన్నారు.

జగన్‌కు తెలిసింది మంచి చేయడమే

- నిడదవోలు ఎమ్మెల్యే శ్రీనివాస్‌నాయుడు
- చివటం గ్రామంలో కొనసాగుతున్న గడప గడపకూ..



చివటంలో వృద్ధురాలికి సంక్షేమ పథకాలు వివరిస్తున్న ఎమ్మెల్యే శ్రీనివాస్ నాయుడు

ఉండ్రాజవరం: తనను నమ్మి అధికారం అప్పగించిన ప్రజలకు రాజకీయాలకు అతీతంగా మంచి చేయడమే సీఎం జగన్‌మోహన్‌రెడ్డికి తెలుసని నిడదవోలు ఎమ్మెల్యే జి. శ్రీనివాస్‌నాయుడు అన్నారు. చివటం గ్రామంలోని సురేంద్ర నగర్, వెంకట్రాయ నగర్, రామకృష్ణ నగర్, ముళ్లపూడి వెంకట్రాయుడు నగర్, జగనన్న-2 కాలనీల్లో ఆదివారం నాలుగో రోజు ఆయన గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. ప్రజాప్రతినిధులు, వైఎస్సార్ సీపీ శ్రేణులతో కలసి ఎమ్మెల్యే ప్రతి ఇంటికీ వెళ్లారు. జగనన్న అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను ప్రజలకు వివరించారు. బుక్‌లెట్లు అందించారు. పథకాలు ప్రతి ఇంటికీ చేరుతున్నాయా? లేదా? అని అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ఇచ్చిన అధికారాన్ని అడ్డు పెట్టుకుని ప్రజలను మోసగించడం చంద్రబాబుకు తెలిసిన విద్య అని విమర్శించారు. ఎన్నికలు దగ్గర పడుతున్నందున అబద్ధపు మాటలతో ప్రజలను మోసగించేందుకు చంద్రబాబు చూస్తున్నారన్నారు. ఈ విషయంలో విజ్ఞతతో ఆలోచించాలని ప్రజలను కోరారు. కార్యక్రమంలో సొసైటీల అధ్యక్షులు కొఠారు సత్యనారాయణ, నాగిరెడ్డి వెంకటేశ్వరరావు, నాయకులు ఎం.శ్యాంకుమార్, గుంటూరు చంద్రశేఖర్, ఎస్.ఈశ్వర చంద్రవరప్రసాద్, మట్టా వెంకటకృష్ణ, యు.భాస్కరరావు, ఆకుల ప్రసాద్, గంటిన లక్ష్మి గణపతి, కేతా వెంకటేశ్వర్లు, పలువురు కార్యకర్తలు పాల్గొన్నారు.

ఎస్సీ, ఎస్టీ టీచర్స్ ఫెడరేషన్ డైరీ ఆవిష్కరణ

దేవరపల్లి: ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారానికి ప్రభుత్వం చిత్తశుద్ధితో పనిచేస్తుందని రాష్ట్ర హోం మంత్రి తానేటి వనిత అన్నారు. జిల్లా ఎస్సీ, ఎస్టీ టీచర్స్ ఫెడరేషన్ డైరీని, క్యాలెండర్‌ను ఆదివారం సాయంత్రం దేవరపల్లిలో మంత్రి వనిత ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మంత్రి తానేటి వనితకు ఉపాధ్యాయులు తమ సమస్యలను వివరించారు. కార్యక్రమంలో ఫెడరేషన్ జిల్లా అధ్యక్షుడు ఎండీ సత్యనారాయణ రెడ్డి, ప్రధాన కార్యదర్శి ఐ. విష్ణుమూర్తి, ఉపాధ్యక్షులు పల్లాల దియ్యపురెడ్డి, సహాయకార్యదర్శి బి. శ్రీను, యు. శ్రీనివాస్, మట్టా ప్రసాద్, ఎస్. మాలతి, విష్ణుప్రసాద్ పాల్గొన్నారు.

చాగల్లు ఎస్సైగా నాగరాజు



చాగల్లు: స్థానిక ఎస్సైగా పి.నాగరాజు ఆదివారం బాధ్యతలు చేపట్టారు. సాధారణ బదిలీల్లో భాగంగా నిడదవోలు పట్టణ పోలీస్ స్టేషన్ నుంచి ఆయన ఇక్కడకు బదిలీపై వచ్చారు. ఈ నేపథ్యంలో గోపాలపురం ఎమ్మెల్యే తలారి వెంకట్రావు, ఏపీ ప్రభుత్వ సలహాదారు రాజీవ్ కృష్ణలను నాగరాజు మర్యాద పూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండలంలో శాంతి భద్రతలకు విఘాతం కలగకుండా చూస్తానన్నారు.

వైనాట్‌లో ఆఫర్ల ఉత్సవం



ఆఫర్ల బ్రోచర్ విడుదల చేస్తున్న వైనాట్ అధినేత వెంకట్రాయుడు

తణుకు: రాష్ట్రంలో ఉత్తమ గృహోపకరణాలు, ఎలక్ట్రానిక్స్ స్టోర్స్ వైనాట్‌లో 30వ వార్షికోత్సవ వేడుకలను పురస్కరించుకుని ఈనెల 29 నుంచి ఏప్రిల్ 9 వరకూ ఆఫర్ల ఉత్సవం నిర్వహించనున్నట్టు వైనాట్ అధినేత జుజ్జవరపు వెంకట్రాయుడు తెలిపారు. రాష్ట్ర వ్యాప్తంగా 31 షోరూంలలో రూ.50 లక్షల విలువ చేసే 1,116 బహుమతులు అందజేస్తామన్నారు. 2022, 2023లో బెస్ట్ టైం బిజినెస్ అవార్డు, ఆసియా టుడే వారిచే ప్రైడ్ ఆఫ్ నేషనల్ అవార్డు పొందిన తమ సంస్థలో ఆన్‌లైన్ కంటే తక్కువ ధరలకు ఉత్పత్తులను అందిస్తున్నామన్నారు.

విద్యుత్తు సమస్యలు తక్షణం పరిష్కరించండి

- అధికారులకు హోం మంత్రి వనిత ఆదేశం

దేవరపల్లి: మండలంలో విద్యుత్తు సమస్యలు ఎక్కువగా ఉన్నందున, తక్షణం వాటిని పరిష్కరించాలని రాష్ట్ర హోం మంత్రి తానేటి వనిత అధికారులను ఆదేశించారు. స్థానిక ఆర్యవైశ్య కల్యాణ మండపంలో వివిధ ప్రభుత్వ శాఖల అధికారులతో ఆదివారం సాయంత్రం ఆమె సమీక్ష జరిపారు. మండలంలోని సమస్యలను ప్రజాప్రతినిధులు, నాయకుల ద్వారా తెలుసుకుని, వాటిపై అధికారులతో మాట్లాడారు. ప్రధానంగా విద్యుతు సమస్యను సర్పంచులు, నాయకులు మంత్రి వనిత దృష్టికి తీసుకువచ్చారు. దీనిపై మంత్రి వనిత స్పందిస్తూ వారం రోజుల్లో విద్యుత్తు సమస్యలు పరిష్కరించాలని, తాను గ్రామ స్థాయి పర్యటనకు వచ్చేనాటికి ప్రజల నుంచి ఫిర్యాదులు రాకూడదని ఆమె అధికారులకు సూచించారు. ప్రజల పట్ల గ్రామ సచివాలయ ఉద్యోగులు నిర్లక్ష్యంగా ఉంటున్నారనే ఫిర్యాదులు వస్తున్నాయని ఆమె అన్నారు. ఇక నుంచి సచివాలయ ఉద్యోగులు పనివిధానాన్ని మార్చుకోవాలని ఆమె హెచ్చరించారు. సమీక్షలో వైఎస్సార్ సీపీ నియోజకవర్గ పరిశీలకుడు గన్నమని వెంకటేశ్వరరావు(జీవీ), ఎంపీపీ కేవీకే దుర్గారావు, ఏఎంసీ చైర్మన్ గన్నమని జనార్దనరావు, వివిధ శాఖల అధికారులు, సర్పంచులు, ఎంపీటీసీ సభ్యులు పాల్గొన్నారు.

సాధారణ ప్రసవాలపై అవగాహన కల్పించాలి

- జిల్లా హాస్పిటల్ సర్వీసెస్ కో–ఆర్డినేటర్ డాక్టర్ సనత్ కుమారి
- నిడదవోలు ప్రభుత్వాసుపత్రి సందర్శన



ప్రభుత్వాసుపత్రిలో రికార్డులు పరిశీలిస్తున్న డాక్టర్ సనత్ కుమారి

నిడదవోలు: ప్రభుత్వాసుపత్రుల్లో సాధ్యమైనంత వరకూ సాధారణ ప్రసవాలు జరిగేలా గర్భిణులు, వారి కుటుంబ సభ్యులకు అవగాహన కల్పించాలని జిల్లా హాస్పిటల్ సర్వీసెస్ కో–ఆర్డినేటర్ డాక్టర్ ఎం.సనత్ కుమారి సూచించారు. నిడదవోలు ప్రభుత్వాసుపత్రిని ఆదివారం ఆమె సందర్శించారు. హాజరు పట్టీని పరిశీలించి డ్యూటీ డాక్టర్‌తో సహా సిబ్బంది అందరూ హాజరు కావడాన్ని గుర్తించారు. ఈ ఆసుపత్రిలో ఈ నెలలో 47 ప్రసవాలు చేసినట్టు తెలుసుకున్నారు. వాటిలో సిజేరియన్ ఆపరేషన్లు ఎక్కువగా ఉండడాన్ని ఆమె గ్రహించారు. సంబంధిత సి–సెక్షన్ కేస్ షీట్‌లను కేసుల వారీగా పరిశీలించారు. ఆసుపత్రిలో ల్యాబ్ ద్వారా అందిస్తున్న పరీక్షలను ధ్రువీకరించడం, ఆరోగ్యశ్రీ వైద్య సేవల కేసుల వివరాలు వెబ్ సైట్‌లో అప్‌లోడ్ చేయడం వంటి అంశాలను తనిఖీ చేశారు. జగనన్న ఆరోగ్య సురక్ష –2లో ఆసుపత్రికి వచ్చిన రిఫరల్ కేసుల వివరాలు అడిగి తెలుసుకున్నారు. వంట గదిని పరిశీలించారు. రోగుల సౌకర్యార్థం క్యాజువాలిటీ గదికి మార్చమని డాక్టర్ సనత్‌కుమార్ సూచించారు. డ్యూటీ డాక్టర్ ఎం.మాధురి, స్టాఫ్ నర్స్, ఇతర సిబ్బంది ఉన్నారు.

నియోజకవర్గ క్రికెట్ పోటీల విజేత 'సమిశ్రగూడెం' జట్టు



విజేతగా నిలిచిన సమిశ్రగూడెం జట్టుతో పీడీలు, పీఈటీలు

నిడదవోలు రూరల్: ఆడుదాం ఆంధ్రా నిడదవోలు నియోజకవర్గ స్థాయి క్రికెట్ పోటీల విభాగంలో సమిశ్రగూడెం సచివాలయం జట్టు విజేతగా నిలిచింది. మండలంలోని తాడిమళ్ల జెడ్పీ హైస్కూల్ మైదానంలో నిడదవోలు మండలం సమిశ్రగూడెం, ఉండ్రాజవరం మండలాల జట్ల మధ్య శనివారం ఫైనల్స్ నిర్వహించారు.

దివ్యాంగుల కేంద్రంలో అన్నదానం

ఉండ్రాజవరం: తమ కుమారుడైన శివసాయి కృష్ణ సహదేవ్ పుట్టిన రోజు సందర్భంగా దళిత ఉద్యోగుల సంఘం జిల్లా కార్యదర్శి గుబ్బలశ్రీనివాస్, కుమారి దంపతులు ఆదివారం మండలంలోని పొలంగి గ్రామంలోని స్పందన మానసిక దివ్యాంగుల కేంద్రంలో అన్నదానం చేశారు. కార్యక్రమంలో ఆల్ ఇండియా ఎస్సీ, ఎస్టీ, బీసీ మైనారిటీ ఉద్యోగుల సంఘం మాజీ అధ్యక్షుడు బొడ్డు విక్టర్‌బాబు పాల్గొన్నారు.

మృతుల కుటుంబాలకు ఎమ్మెల్యే పరామర్శ

నిడదవోలు రూరల్: మండలంలోని మునిపల్లి గ్రామంలో ఇటీవల మృతి చెందిన వైఎస్సార్ సీపీ నాయకుల కుటుంబ సభ్యులను ఎమ్మెల్యే జి.శ్రీనివాస్‌నాయుడు ఆదివారం పరామర్శించారు. మునిపల్లికి చెందిన ఇర్లపాటి సంసోను, బావన రాము, మండా సతీష్, వెలగన దుర్గాప్రసాద్, ఎస్.రాణి మృతి చెందారు. ఎమ్మెల్యే వారి ఇళ్లకు వెళ్లి వారి చిత్ర పటాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. వైఎస్సార్ సీపీ మండల శాఖ అధ్యక్షుడు అయినీడి పల్లారావు, జెడ్పీటీసీ సభ్యుడు కొయ్యే సూరిబాబు, జేసీఎస్ మండల కన్వీనర్ వెలగన పోలయ్య, సర్పంచ్ వెలగన నరేష్, ఎంపీటీసీ సభ్యుడు కొర్లపాటి మోహన్, పార్టీ నాయకులు ముళ్లపూడి శ్రీనివాస్‌కుమార్ చౌదరి తదితరులు పాల్గొన్నారు.

ఎన్నారైల విరాళంతో కళాశాలలో ల్యాబ్





విరాళంతో నల్లజర్ల ఇంటర్ కళాశాల్లో ఏర్పాటు చేసిన ల్యాబ్ (అంతర చిత్రం) ఎన్నారై దంపతులు చాగంటి జయదేవ్, శేష రాజేశ్వరి

నల్లజర్ల: స్థానిక జెడ్పీ హైస్కూల్లో ప్రభుత్వం ఏర్పాటు చేసిన ఇంటర్ కళాశాలలో ల్యాబ్ ఏర్పాటుకు ప్రవాస భారతీయులైన చాగంటి జయదేవ్, శేషరాజేశ్వరి దంపతులు రూ.1.50 లక్షలు విరాళంగా అందజేశారు. ఈ హైస్కూల్ ప్రధానోపాధ్యాయిని కోమలీ చిత్రకు వారిద్దరూ సమీప బంధువులు. జయదేవ్ అమెరికాలో సాఫ్ట్‌వేర్ ఉద్యోగి కాగా, శేషరాజేశ్వరి మిచనిక్ ల్యాబొరేటరీలోని డ్రగ్ డెలివరీ విభాగంలో పీహెచ్‌డీ చేస్తున్నారు. హెచ్ఎం కోమలీ చిత్ర కోరిక మేరకు వారిచ్చిన విరాళం సొమ్ముతో బోటనీ, జువాలజీ, కెమిస్ట్రీ ల్యాబ్‌లో అవసరమైన సామగ్రి ఏర్పాటు చేశారు.

మోటార్ సైకిళ్లు ఢీ: ఇద్దరికి గాయాలు

గోపాలపురం: స్థానిక వాదాలకుంట రోడ్డులో ఆదివారం ఎదురెదురుగా వస్తున్న రెండు మోటార్ సైకిళ్లు ఢీకొన్న ప్రమాదంలో ఇద్దరు తీవ్రంగా గాయపడ్డారు. స్థానికుల వివరాల ప్రకారం కరిచర్లగూడేనికి చెందిన మస్తాన్‌బాబు, గోపాలపురానికి చెందిన డి.చంద్రశేఖర్ వేగంగా చెరో మోటార్ సైకిల్‌పై ఎదురెదురుగా వస్తూ ఢీ కొట్టారు. చంద్రశేఖర్ తలకు బలమైన గాయమైంది. మస్తాన్‌బాబుకు స్వల్ప గాయాలయ్యాయి. ఇద్దరినీ గోపాలపురం కమ్యూనిటీ హెల్త్ సెంటర్‌లో ప్రాథమిక చికిత్స చేశారు. చంద్రశేఖర్ పరిస్థితి విషమంగా ఉంది.